ఈనాడు వికారాబాద్
సోమవారం సెప్టెంబరు 30, 2024

సాగని పనులు.. రోడ్లన్నీ గుంతలు

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. మొత్తం 36 వార్డులకు గాను ఒక్కో వార్డులో ఎస్‌డీఎఫ్ కింద 2023లో అప్పటి భారాస ప్రభుత్వం రూ.కోటి చొప్పున వ్యయం చేసి సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టాలని తలపెట్టింది. ఆ మేరకు అప్పటి ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపన చేశారు. కొన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణాలు జరిగాయి. చాలా వార్డుల్లో మాత్రం జరగలేదు. రోడ్లన్నీ గుంతలతో నిండి రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను తెలిపే బాలగోకులం

పిల్లలకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలో చిన్నారులకు ఆదివారం బాల గోకులం నిర్వహించారు. ఆదర్శ తులసీ నగర్ కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక దేవాలయం, సాయిపూరు ప్రాంతంలోని భవానీనగర్ కాలనీలోని శివాలయంలో కార్యక్రమాన్ని వారం వారం ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించారు. చిన్నారులకు దేశభక్తి గేయాలు, భగద్గీత శ్లోకాలు, రామాయణం, మహా భారతం, పొడుపు కథలు, నీతి వాక్యాలు, నీతి కథలను వివరించారు. అలాగే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సూర్య నమస్కారం ఆవశ్యకత, విశిష్టతలపై ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు బోధించారు. చిన్నారులను ప్రతి వారం పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

వచ్చేస్తున్నాయ్.. జిల్లాలో తొలివిడత ఐదు ఏర్పాటు
మహిళా శక్తి క్యాంటీన్లు

మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంతోపాటు స్థానికులకు నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంగా ప్రభుత్వం 'మహిళా శక్తి క్యాంటీన్ల' ఏర్పాటుకు ఇటీవల ఆదేశించింది. దీన్లో భాగంగా జిల్లా తొలివిడతలో ఐదింటిని అందుబాటులోకి తెచ్చేందుకు తాజాగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటి నిర్వహణకు కార్యాచరణ సైతం రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 655
మహిళా సంఘాలు: 15,966
నమోదైన సభ్యులు: 1,69,000

హోటల్‌కు వెళ్తే కనీసం రూ.100 ఖర్చు

జిల్లా కేంద్రం వికారాబాద్‌లో కలెక్టరేట్, ఇతర ముఖ్య కార్యాలయాలు, తాండూరులో గనులు, సిమెంటు కంపెనీలు, పరిగి, కొడంగల్ మున్సిపల్ కేంద్రాల్లో వివిధ కార్యకలాపాలు, ప్రధాన ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. ప్రజలు, రోగులు తమ పనుల నిమిత్తం అయా ప్రాంతాలకు నిత్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా వేచి ఉండాల్సి వస్తోంది. ఇలాంటి వారంతా మధ్యాహ్నం భోజనం చేయాలంటే హోటల్‌కు వెళ్తే కనీసం రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందరు అంత పెట్టుకోలేక ఏదో ఒక టిఫిన్‌తో సర్దుకుంటున్నారు.

ఎక్కడెక్కడ అంటే...

ప్రాంతాలు	సంఖ్య
కలెక్టరేట్	1
పరిగి	1
కొడంగల్	1
తాండూరు	2

ఇవన్నీ గమనించిన ప్రభుత్వం తక్కువ ఖర్చుతో నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంకల్పించింది. అందులో భాగంగా 'మహిళా శక్తి క్యాంటీన్లను' ఏర్పాటు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించింది. ఈమేరకు జిల్లాలోని 5 ముఖ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మహిళలకు అప్పగించడం ద్వారా రుచికర భోజనం సిద్ధం చేయడంతోపాటు పరిశుభ్రతను పాటించేందుకు ఎక్కువ వీలుంటుందని పేర్కొంటున్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు

రూ.15లక్షల నుంచి రూ.25 లక్షల ఖర్చు

- క్యాంటీన్ల ఏర్పాటుకు రూ.15లక్షల నుంచి రూ.25లక్షల ఖర్చుకు ప్రణాళిక. • బ్యాంకు లింకేజీ రుణం కింద మంజూరు. • నెలనెలా సులభ వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు. • స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యతలు. • సులభంగా గుర్తించేందుకు ఒకే రంగు.

హైదరాబాద్‌లో 10 రోజుల శిక్షణ

క్యాంటీన్ల నిర్వహణ, భోజనం, అల్పాహారం తయారీ, శుభ్రతకు సంబంధించి మహిళలకు రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో పది రోజుల పాటు శిక్షణ అందించనున్నారు. అనంతరం క్యాంటీన్లను ఆయా చోట్ల నెలకొల్పి స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల చేతుల మీదుగా ప్రారంభిస్తారు.

జిల్లాలో త్వరలో ప్రారంభిస్తాం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొదటి విడతగా ఐదు క్యాంటిన్లను ఏర్పాటు చేయిస్తాం. నిర్వహణకు ఎంపికైన డ్వాక్రా మహిళలకు త్వరలో హైదరాబాద్‌లో పది రోజులపాటు శిక్షణ ఇప్పిస్తాం. మార్గదర్శకాలు అందిన వెంటనే క్యాంటీన్లను ప్రారంభించి ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తాం. – రామమూర్తి, డీపీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ.

'ఆదర్శ' వంటగది.. ఇలాగే ఉంటుంది మరి

తాండూరు మండల 'ఆదర్శ' పాఠశాల, కళాశాలలో వంట గది శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధంగా ఉన్న రేకుల షెడ్డు కింద 400 మందికి వంట చేసేందుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. వర్షాలు కురిస్తే నీరు లోపలికి పడుతూ అపరిశుభ్రత ఏర్పడుతోంది. వంట సామగ్రి, నిత్యావసర సరకుల నిల్వకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు వెంటనే వంటశాల నిర్మించజేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ.

ఆహ్లాదకరం.. ప్రకృతిలో మమేకం

కనుచూపు మేర ఆహ్లాదకర అటవీ ప్రాంతం. మధ్యలో ప్రత్యేకించి చూస్తేగానీ కనిపించని ఇళ్లు. ఇలాంటి వాతావరణానికి నెలవైంది కొడంగల్ మండల పరిధిలోని భీమ్లితండా. ప్రకృతిలో మమేకమవుతూ తండా వాసులు ముందుకు సాగుతున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్.

తేలిన చువ్వలు.. తరచూ ప్రమాదాలు

పెద్దేముల్ మండలం బుద్దారం వంతెనపై ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చువ్వల మధ్యలో టైర్లు ఇరుక్కొని చోదకులు కింద పడి గాయాల పాలవుతున్నారు. టైర్లకు పంక్చర్లు పడుతున్నాయి. వంతెన వద్దకు రాగానే అవస్థలకు గురి కావాల్సి వస్తోందని పలువురు వాహనదారులు తెలిపారు. మూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పెద్దేముల్.

ప్రజా సమస్యల పరిష్కారానికి భాజపా పోరు

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి భాజపా పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని మద్గుల్ చిట్టెంపల్లిలో పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భాజపాను పటిష్ఠం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా జనరల్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

వరి.. మురిపిం'చేను'

తాండూరు మండల పరిధిలోని గ్రామాల్లో 10వేల ఎకరాలకు పైగా రైతులు వరి పండిస్తున్నారు. ఎండనక, వాననక పడిన కష్టానికి పైర్లు ఏపుగా ఎదుగుతున్నాయి. కనుచూపు మేర భూమికి అకుపచ్చటి రంగేసినట్లుగా కనువిందు చేస్తున్నాయి. ఆసాంతం గాలులకు తలలూపుతూ దారిన వెళ్లే వారిని చూపు మరల్చ నివ్వడంలేదు. కళకళలాడుతున్న పంటలను చూసి రైతన్నలు మురిసిపోతున్నారు. – తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కొడంగల్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ శివరాములు గౌడు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామానికి చెందిన మాలల ఉషనప్ప (48) హస్నాబాద్ పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం చెరువులో శవం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతనికి భార్య బాబమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. చేపల వేటకు ఎవరికీ చెప్పకుండా వెళ్లవద్దని, అలాగే రాత్రివేళ అసలు వెళ్లరాదని పోలీసులు సూచిస్తున్నారు. కొందరు చాటుమాటుగా రాత్రిళ్లు వెళ్లి పొరపాటున చెరువులో పడి మృత్యువాత పడుతున్నారని, ముందుస్తు జాగ్రత్తలు అవసరమని తెలిపారు.

జుంటివాగు.. అప్పుడే ఒట్టిపోయె!

- అధ్వాన మరమ్మతులతో భారీ గండి..
- పరదంతా కాగ్నా పాలు

న్యూస్‌టుడే, బషీరాబాద్

భారీ వర్షాలతో మొన్నటి వరకు కళకళలాడిన జుంటివాగు అప్పుడే వెలవెలబోతోంది. చెక్‌డ్యాం కుడివైపున వింగ్‌వాల్స్‌కు భారీ గండి పడడంతో నీరంతా వృథాగా కాగ్నానదిలోకి తరలిపోయింది. గతంలో మరమ్మతులు చేపట్టిన గుత్తేదారు నాసిరకంగా పనులు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.అరకోటి నిధులతో పనులు..

ఆరేళ్ల క్రితం జుంటివాగు మరమ్మతుల కోసం అప్పటి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు చేపట్టి చెక్‌డ్యాం కింది భాగం మరమ్మతులు, ఎత్తు పెంచడం, కాల్వలు, తూము బాగు చేయడం వంటి పనులు చేశాడు. ఇందుకు అధికారులు రూ.25లక్షల బిల్లులు చేశారు. వింగ్‌వాల్స్ పనులు, చెక్‌డాం వద్ద మరికొంత పనులు చేయకుండానే గుత్తేదారు వదిలేశాడు. దీంతో కొత్త పనులు ప్రతిపాదించలేక అధికారులు సైతం వదిలేశారు. జుంటివాగు చెక్‌డ్యాం లీకేజీ, వింగ్‌వాల్స్ పనులు నాణ్యతగా చేయకపోవడంతో మొదటికే మోసమొచ్చింది. చిన్నగా ఏర్పడిన లీకేజీ కాస్త.. కురిసిన వర్షాలకు భారీ గండి పడింది. దీంతో నీరంతా వృథా అయిపోయింది.

నీరులేక ఇలా మిగిలింది

ముందే చెప్పిన 'ఈనాడు'

జుంటివాగు చెక్‌డ్యాం, తూము లీకేజీలు అవుతున్నాయని, అప్రమత్తం కావాల్సిన అవసరముందని 2022 జనవరిలో 'ఈనాడు' ముందే హెచ్చరించింది. అయినా పనులు నాణ్యతగా జరగలేదని, ప్రస్తుతం పూర్తిగా జుంటివాగు చెక్‌డ్యాం లీకేజీలమయమైందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.

పనులు చేసినా ప్రయోజనం సున్నా

జుంటివాగు మరమ్మతులకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంగం పనులు మాత్రమే అయ్యాయి. అవీ నాణ్యతగా జరగలేదు. ప్రస్తుతం చెక్‌డ్యాంకు కుడివైపున భారీగండి ఏర్పడింది. పూడ్చాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. అప్పట్లోనే పనులు బాగా చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అధికారులు స్పందించి ఇప్పటికైనా బాగు చేయించాలి.

– వెంకటయ్య, ఆయకట్టు రైతు.

ఉన్నతాధికారులకు తెలిపాం

జుంటివాగు గండి విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. నేను ఇక్కడ విధులకు రాక ముందే ఈ పనులు జరిగాయి. అన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. గుత్తేదారు ఇంకా చేయాల్సి ఉంది. మేం వింగ్‌వాల్స్‌కు తాత్కాలిక మరమ్మతులు చేయించాం. అయినా నీటి ఉధృతికి గండి పడింది. – సాయి, ఏఈ, సాగునీటిశాఖ.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా

జిల్లాల వారీగా ట్రాన్స్‌జెండర్లు
సంగారెడ్డి 46
మెదక్ 09
సిద్దిపేట 07
వికారాబాద్ 138

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న ఊర్లో ఐదు కి.మీ. లోపు పని కల్పిస్తోంది. పేదలకు ఈ పథకం వరంగా మారింది.
గ్రామీణ ప్రాంతాల్లో వయోజనులలో ప్రతి కుటుంబానికి ఏడాది పాటు వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధి పనుల్లో ట్రాన్స్‌జెండర్లకు సైతం చోటు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. సమాజంలో వారిని చిన్నచూపు చూడకుండా సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వారు కోరుకున్న చోట్ల జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని ఆదేశాలివ్వడం గమనార్హం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారిని చేర్పించేందుకు శ్రీకారం చుట్టారు.

పని చేస్తున్న కూలీలు

దరఖాస్తు ఇలా..

ఉపాధి హామీ పథకంలో చేరేందుకు ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల కోసం దరఖాస్తు ఫారంలో ప్రత్యేక కాలమ్‌ను రూపొందించారు. మండల స్థాయిలో ప్రోగ్రాం అధికారి (పీవో) లాగిన్‌లో జాబ్ కార్డు నమోదుకు అవకాశం కల్పించారు. పని కోరే వారి కుటుంబ సభ్యులందరికీ పని కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. జాబ్ కార్డులో చేర్పులు, మార్పులకు సైతం అవకాశం కల్పించారు.

వివక్ష చూపొద్దని..

పథకంలో చేరిన వారికి పని లేదని చెప్పి పక్కన పెడితే చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని ఆదేశాల్లో స్పష్టంచేశారు. వారికి కచ్చితంగా పని చూపించాల్సిందే. అందరు కూలీలతో సమానంగా చూడాల్సిందే. పని ప్రదేశంలోనూ వివక్ష చూపొద్దు. తోటివారికి సైతం ఈ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి జిల్లా, మండల స్థాయిలో ఓ నోడల్ అధికారిని సైతం నియమించాలని నిర్ణయించారు. పనుల కల్పనలో భాగంగా ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఆదేశాలతో చర్యలు:

జ్యోతి, సంగారెడ్డి డీఆర్డీవో

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో ట్రాన్స్‌జెండర్లకు పనుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారు పథకంలో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్

పర్యావరణహితం.. యువ అభిమతం

పర్యావరణ హితమే లక్ష్యంగా డిగ్రీ విద్యార్థులు అడుగులేస్తున్నారు. కళాశాలల్లో ఏకో క్లబ్‌లు ఏర్పాటుచేసుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు.
అధ్యాపకుల సహకారంతో క్లబ్‌ల ఆధ్వర్యంలో కళాశాలతో పాటు సమీప గ్రామాల్లోనూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.

మొక్కలు నాటి..

మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏకో క్లబ్ ఏర్పాటైంది. వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి కన్వీనర్‌గా, అధ్యాపకులు రాజు, విశ్వనాథం సభ్యులుగా కొనసాగుతున్నారు. మొత్తం 150 మంది సభ్యులుగా ఉన్నారు. ఏటా కళాశాలలో పలు మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇటీవల క్యానోఫీ అనే ప్రత్యేక రకానికి చెందిన 30 మొక్కలు నాటారు. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంచేలా కృషి చేస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వృక్షా బంధన్ చేపట్టారు. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. తాజాగా నీటి వసతి లేని చోట మొక్కల పెంపకానికి వీలుగా ఎకరాకు సరిపడా 200 విత్తన బంతులు తయారు చేశారు. పాతూర్ శివారులోని అడవిలో వెదజల్లారు.

మెదక్‌లో విత్తన బంతులతో విద్యార్థులు

స్కానింగ్‌తో చరిత్ర తెలిసేలా..

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ కల్పనతో సిద్దిపేటలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందంజలో ఉంటోంది. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏకో క్లబ్ కీలకపాత్ర పోషిస్తోంది. కళాశాలలో 1500కి పైగా మొక్కలు, చెట్లు పెంచుతున్నారు. కూరగాయలు, ఔషధ, తులసీ, రోజాపూల ఉద్యానాలు నిర్వహిస్తున్నారు. కన్వీనర్‌గా వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. రాణి కొమ్మిడి, సభ్యులుగా ఐదుగురు అధ్యాపకులు వ్యవహరిస్తున్నారు. ఏటా ప్రథమ సంవత్సర విద్యార్థులకు సభ్యత్వం కల్పిస్తున్నారు. ఇలా 60 మంది భాగస్వాములవుతున్నారు. 15 రోజులకోసారి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 500 మొక్కలకు క్యూఆర్ కోడ్‌లను బిగించారు. స్మార్ట్ చరవాణి నుంచి స్కాన్ చేస్తే.. వివరాలన్నీ తెలిసిపోతాయి. దీన్ని ఏళ్లుగా సాగిస్తున్నారు.

త్వరలో ఏర్పాటు..

వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కమిటీని త్వరలో ఏర్పాటుచేయనున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ గీతా లక్ష్మి పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ దిశగా కృషి జరుగుతోంది. అక్టోబరు 1న విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పలు కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

చదువుతూనే ఉద్యోగం..

స్వశక్తితో యువతుల రాణింపు

యోగానే లోకమైంది..

- ఎల్.సింధూరి

ప్రస్తుత తరుణంలో అత్యధిక శాతం యువత సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను విస్మరిస్తున్నారు. కుటుంబ స్థితిని లెక్కచేయక అడ్డగోలుగా ఖర్చు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందుకు భిన్నంగా మరికొందరు కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తూ.. సొంతకాళ్లపై నిలబడుతున్నారు. చదువు సాగిస్తూనే ఉద్యోగం చేస్తూ లక్ష్యాన్ని చేరేందుకు శ్రమిస్తున్నారు. ఈ కోవకు చెందిన ఇద్దరు యువతులు డిగ్రీ దశలోనే యోగా శిక్షకులుగా మారి పది మందికి ఆదర్శంగా నిలుస్తుండటం విశేషం. ప్రతిభను నిరూపించుకునేందుకు ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొంటున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తమ ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. ఆయా విశేషాలు ఇలా..

మా సొంతూరు కొండపాక మండలం మర్పడ్గ. సిద్దిపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. అక్కడ చదువును కొనసాగిస్తూనే ఏడాదిగా ఓ ప్రైవేటు పాఠశాలలో యోగా శిక్షకురాలిగా ఉద్యోగం చేస్తున్నా. ఒక ప్పుడు యోగా అంటే కనీస అవగాహన లేదు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదివే క్రమంలో పీఈటీ సతీశ్ యోగా వైపు మళ్లించారు. అప్పటి నుంచి రాష్ట్ర స్థాయిలో పదిసార్లు, జాతీయస్థాయిలో నాలుగు సార్లు పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న సంప్రదాయ పోటీల్లో పాల్గొంటున్నా. ప్రస్తుతం యోగానే లోకమైంది. పోటీలు ఉంటే నిత్యం, మిగిలిన సందర్భాల్లో పాఠశాలలో పిల్లలకు బోధిస్తూ సాధన చేస్తున్నా. పోలీసు కొలువు సాధనే లక్ష్యం.

నాన్న మరణం కదిలించింది..:

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో బీజడ్‌సీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో శిక్షకురాలిగా చేస్తున్నా. ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేకంగా బోధిస్తున్నా. గతంలో ప్రైవేటు పాఠశాలలో బోధించా. ఆరో తరగతి నుంచి యోగాపై ఆసక్తి ఏర్పడింది. రాష్ట్రస్థాయిలో పది, జాతీయస్థాయిలో ఎనిమిది సార్లు పాల్గొన్నా. గతంలో సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ సహకారంతో నిర్వహించిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసి.. అర్హత సాధించా. పిల్లలకు చెబుతూ సాధన చేస్తున్నా. జాతీయస్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం. ఏడాది కిందట నాన్న మల్లేశం అనారోగ్యంతో చనిపోయారు. దీంతో శిక్షకురాలిగా మారాల్సి వచ్చింది. సొంతకాళ్లపై నిలబడితే ఆ ఆనందం వేరు. కుటుంబానికి బాసటగా మారా. **ఎ.మనీషా**

న్యూస్‌టుడే, సిద్దిపేట

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి నమరం

ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, మెదక్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం షురూ కానుంది. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయవచ్చు.

డిసెంబరు 30న తుది జాబితా: ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు తొలి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

కొత్తగా నమోదు..: ఐదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటేసిన, వేయని వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ మంది ఓటర్లున్నారు. ఈ సారి 15 జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయు ఓటును నమోదు చేసుకోవాలి. సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా ఫారమ్-18లో వివరాలు నమోదు చేయాలి. డిగ్రీ మార్కుల మెమోతో పాటు ఆధార్ సహా ఇతర పత్రాలు జోడించాలి. వాటిని తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు.

2019 జాబితా ప్రకారం..

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	-	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

సాహిత్య కోవెల మరసం

సిద్దిపేట, న్యూస్‌టుడే: మరసం సాహిత్య కోవెల అని, ఎంతో మంది మేధావులు పుట్టుకొచ్చారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మంజీరా రచయితల సంఘం(మరసం) 38వ వార్షికోత్సవాన్ని సిద్దిపేట వివంచి కళానిలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి, వివిధ కారణాలతో మృతి చెందిన సంఘం ప్రతినిధులు, సామాజిక, సాహితీవేత్తలకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాశరథి స్ఫూర్తితో సాహితీవేత్తలు పోరాటం సాగించారని పేర్కొన్నారు. సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మంజీరా మహానదిలా మరసం ప్రవహించిందని, మళ్లీ ఉపనదిలా మారాలన్నారు. సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించి మార్గదర్శనం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ మరసం తనలో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఎన్నో విషయాలను సంఘం నుంచి నేర్చుకున్నానని, ధూంధాం అనే ఆలోచన కల్పించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ కాశీం, మరసం అధ్యక్షుడు కె.రంగాచారి మాట్లాడారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ రచించిన జయజయహే తెలంగాణ పాటల పుస్తకం, మరసం కవులు రచించిన జోట పాటలు సంకలనం, సిద్దెంకి యాదగిరి రచించిన మూడు గుడిసెల పల్లె పుస్తకాలను ఆవిష్కరించారు. టీవీస్టీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరం, ప్రతినిధులు సిద్దెంకి యాదగిరి, తోట ఆశోక్, పరమేశ్వర్, తిరుపతిరెడ్డి, అంజయ్య ఉన్నారు.

హాజరైన సంఘ ప్రతినిధులు, సాహితీవేత్తలు

పుస్తకాల ఆవిష్కరణలో ప్రొఫెసర్ కాశీం, సాహితీవేత్త కె.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. చిత్రంలో ఎడమ నుంచి కుడివైపు సిధారెడ్డి, విరాహత్‌అలీ, రంగాచారి, యాదగిరి తదితరులు

క్రీస్తును స్తుతించి.. ప్రార్థనలు చేపట్టి

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం కరుణామయుడి నామస్మరణతో మార్మోగింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. డ్రైసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధన చేపట్టారు. రిటైర్డ్ డ్రైసిబిటరీ శ్రీనివాస్‌రావు దైవసందేశాన్ని వినిపించారు. వివిధ ప్రాంతాల చెందిన భక్తులు, పర్యాటకులు ఏసయ్యను దర్శించుకుని పరవశించారు. గురువులు భక్తులను ఆశీర్వదించారు.

ప్రార్థనా మందిరంలో భక్తులు

వినూత్నం.. కేవీకే భవనం

15 ఎకరాల విస్తీర్ణం.. ఎర్రరాయితో నిర్మించిన భవన సముదాయం.. చుట్టూ పచ్చదనంతో ఆకట్టుకుంటోంది సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిడ్గి శివారులోని కృషి విజ్ఞాన కేంద్రం. 1994లో దీన్ని నిర్మించారు. దీని ఆవరణలో వివిధ రకాల పంటల క్షేత్రాలు, పండ్ల తోటలతో పాటు ఔషధ నగరి సైతం ఉంది. ఇక పరిపాలనా భవనాన్ని పూర్తిగా ఎర్రరాయితో నిర్మించారు. అప్పట్లో సిమెంటుకు బదులుగా డంగు సున్నం ఉపయోగించడం విశేషం. సముదాయాన్ని వృత్తాకారంలో రెండు అంతస్తులలో నిర్మించారు. కేంద్రంలో ఉద్యాన, వ్యవసాయ విస్తరణ, గృహ విజ్ఞాన, పశుపోషణ తదితర విభాగాలకు చెందిన ఏడు గురు శాస్త్రవేత్తలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో విభాగానికి ఒక్కో గదిని కేటాయించారు. అందులో వైకప్పు వృత్తాకారంలో, వాటి ద్వారాలు పిట్టగూళ్లను తలపించేలా ఉంటాయి. భోజనశాల సైతం వృత్తాకారంలో ఏర్పాటుచేశారు. ఇభవనం మధ్యలో విశాలమైన స్థలం, అతిథులు బస చేసేందుకు వసతులు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

తెలంగాణ భవన్ ముట్టడిస్తాం: ప్రాజెక్టుల నిర్వాసితులు

మాట్లాడుతున్న నిర్వాసితులు

గజ్వేల్ గ్రామీణ: వేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడటం... దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల నిర్వాసితులు వ్యాఖ్యానించారు. ఇటీవల హైదరాబాద్‌లో 'హైడ్రా' చర్యల వల్ల ఆస్తులు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులతో హరీశ్‌రావు మాట్లాడిన తీరును జలాశయాల నిర్వాసితులు ఎద్దేవా చేశారు. గతంలో భారాస ప్రభుత్వం చేసిన విధ్వంసాలను తెలియజేసేందుకు కన్నెపల్లి నుంచి కొండపోచమ్మ ప్రాజెక్ట నిర్వాసితుల వరకు అందరితో కలిసి తెలంగాణ భవన్‌ను ముట్టడిస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే రాని ఏడుపు హరీశ్‌రావుకు ఇప్పుడు ఎలా వస్తోందన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులపై లాఠీచార్జీ చేసి, 144 సెక్షన్ పెట్టినప్పుడు.. మల్లారెడ్డి అనే నిర్వాసితుడు తన చితిని తానే పేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నపుడు ఆయనకు ఎందుకు దుఃఖం రాలేదని ప్రశ్నించారు. తమ హక్కులను అడిగినప్పుడు కేసులు నమోదు చేయించిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేసే హరీశ్‌రావు ఆస్తులు, ఫాంహౌస్‌లపై విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జలాశయాల భూ నిర్వాసితులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు భానుప్రకాష్‌రావు పాల్గొన్నారు.

చోరీలకు వచ్చి.. పోలీసులకు చిక్కి

ముగ్గురు అరెస్టు, పరారీలో నలుగురు

నర్సాపూర్: చోరీలకు వచ్చిన ముగ్గురు దొంగలు నర్సాపూర్ పోలీసులకు చిక్కారు. నర్సాపూర్ సీఐ జానకిరెడ్డి తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌లో శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బానోత్ రాములు, రాథోడ్ తారాసింగ్, రాథోడ్ జయరాం పోలీసులకు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఏడుగురు దొంగల ముఠాకు చెందినవారుగా తేలింది. వీరంతా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలానికి చెందిన వారు. ఆయా కేసుల్లో నిందితులు, పాతనేరస్థులు. సమయానుసారంగా ఐదారుగురు కారులో వచ్చి రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడతారు. గతంలో మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి, విలువైన బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటనల్నాయి. నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి, చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్, చండూర్, జిన్నారం మండలం సోలక్‌పల్లి, దాదిగూడెంలో చోరీలకు పాల్పడినట్లుగా వెల్లడైంది. ఇలా పీఎస్ నర్సాపూర్-2, చిలప్‌చెడ్-2, జిన్నారం-2లో మొత్తం ఆరు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. పట్టుకున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 12 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామని సీఐ జానకిరెడ్డి తెలిపారు. మరో నలుగురు విజయ్‌కుమార్, రమేశ్, రాజు, రవిలను త్వరలో పట్టుకుంటామన్నారు. ఎస్సై లింగం తదితరులున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో విజేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిష్యాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు గెలిచింది.

ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడోత్సవాలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న సిద్దిపేట-మెదక్ జోన్ జట్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాజన్నసర్కిల్ అటవీశాఖ రెండో జోనల్ క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. సిద్దిపేట, మెదక్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 200 వందల మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మొత్తం 104 అంశాల్లో పురుషులు, మహిళలు, సీనియర్ వెటరన్స్, జూనియర్ వెటరన్స్ విభాగాల్లో ఉద్యోగులు ప్రతిభ చూపారు. 406 పాయింట్లతో సిద్దిపేట-మెదక్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. విజేతలకు సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, నిఖిత, బాలమణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్రీడలను వ్యాయామోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, సుజాత, వెంకటస్వామిగౌడ్, ఉప్పలయ్య, కనకారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్‌మోహన్‌గౌడ్ పర్యవేక్షించారు.

ఆసుపత్రులు, మెట్రోస్టేషన్లే లక్ష్యంగా చోరీలు

సికింద్రాబాద్: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీ చేస్తున్న దొంగను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక ఠాణాలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ కూలీ పనులు చేస్తున్నాడు. కుటుంబ పోషణకు డబ్బు చాలక నగరంలోని చర్లపల్లికి వచ్చి బైకుల చోరీ మొదలుపెట్టాడు. దొంగిలించిన వాహనాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. రెండ్రోజులుగా గాంధీ ఆసుపత్రి ఆవరణలో బైకులు మాయమవుతుండగా, బాధితుల ఫిర్యాదుతో చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ నేతృత్వంలోని సిబ్బంది మాటు వేసింది. సీసీ ఫుటేజీల ఆధారంగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నీలోఫర్, ఈఎస్ఐ, ఉస్మానియా ఆసుపత్రులు, మియాపూర్, మెట్టుగూడ, నాంపల్లి మెట్రోస్టేషన్లు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు. శ్రీనివాస్‌తో పాటు బైకులు కొనుగోలు చేసిన ఏసురత్నం, శాంతారావును అదుపులోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు

ఫారంకోడి	115-00	డ్రెస్డ్	199-00
రిటైల్	137-00	స్కిన్‌లెస్	226-00

ప్రాణాలు.. గల్లంతు!

లోతట్టు వంతెనల వద్ద తరచూ ప్రమాదాలు

ఉద్ధృతంగా పారుతున్న నారింజ వాగు

- జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద బుధవారం వంతెన మీదుగా నారింజ వాగును బైక్‌తో దాటుతూ ఒకరు గల్లంతవగా మరొకరు ముళ్ల పొదలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం దొరికింది.
- న్యాల్‌కల్ మండలం చాల్కి-అమీరాబాద్ మధ్యలో వాగును రాత్రివేళ బైక్‌తో దాటుతూ వరదలో కొట్టుకుపోయి యువకుడు మృతిచెందగా మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు.
- జహీరాబాద్ మండలం సత్వార్‌లోని బంధువుల ఇళ్లకు వచ్చి గ్రామంలోని లోలెవల్ వంతెనను కాలినడక దాటుతూ ఇద్దరు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు.

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

ఇవీ.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని భారీ వర్షాలు కురిసి వాగులు పొంగడంతో లోతట్టు (లోలెవల్) వంతెనల వద్ద వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన ప్రమాద ఘటనల్లో కొన్ని. 'భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగులు పొంగుతున్నాయి.. వంతెన మీదుగా వరద ఉద్ధృతంగా పారుతుండటంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు నిలిచిపోతున్నాయి. ఆయా వంతెనల ఎత్తు పెంచాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటా

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కొడంగల్, న్యూస్‌టుడే: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలో సోమవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కార్గిల్ కాలనీ, పర్సాపూర్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పలుగురాళ్ల తండా, మిషన్ భగీరథ ప్రాంతాల్లో లైన్ మార్పు పనులు చేయనున్నారు. ఇందు కోసం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా సుచరితారెడ్డి

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: వికారాబాద్‌కు చెందిన సుచరితారెడ్డి భాజపా మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞత తెలిపి, పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని సుచరితారెడ్డి తెలిపారు.

వేతనం అందక ఉపాధ్యాయుల ఆందోళన

కొడంగల్, న్యూస్‌టుడే: గత మూడు నెలలుగా గురుకుల పాఠశాల, కళాశాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..కొడంగల్‌కు చెందిన ఎస్సీ గురుకుల పాఠశాల చేవేళ్ల దగ్గర ముడిమ్యాలలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు వేతనాలు అందించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, చందర్, వాసురామ్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా పని చేస్తాం

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మెరుగైన పనితీరుతో తాండూరు మండలం గౌతాపూర్ శివారు పోలీస్ స్టేషన్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చామని, ఇకముందు మరింత ఉత్తమ సేవల అందించేందుకు కృషి చేస్తామని ఎస్సై విఠల్‌రెడ్డి అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఠాణాకు రాష్ట్రంలో 7వ స్థానం దక్కడం పట్ల చంద్రవంచ గేటు హనుమాన్ ఆలయ కమిటీ అభినందిస్తూ ఎస్సై బృందాన్ని శాలువా, పూలమాలలతో వై.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏఎస్సై పవన్, వ్యవసాయ విపణి డైరెక్టర్ జర్నప్ప, శాంత్‌కుమార్, బీరప్ప పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో క్రికెట్ పోటీలు

పెద్దేముల్, న్యూస్‌టుడే: పెద్దేముల్‌లో చిట్టేపు ప్రకాశ్‌రెడ్డి స్మారకార్థం ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 99669-52810, 88978-12876 చరవాణి నంబర్లలో సంప్రదించాలన్నారు. విజేత జట్టుకు రూ. 21వేలు, రూ.11వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు.

కొత్త కాలనీలు.. సమస్యలకు నిలయాలు

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామ, పట్టణాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, ఇరుకు ఇళ్ల మధ్య నివాసాలతో ఇబ్బందులతో ప్రజలు కొత్తగా భవనాలు నిర్మించుకుంటున్నారు. దీంతో కొత్త కాలనీలు విస్తరిస్తున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా వాటిల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. దీంతో ప్రజలు నిత్యం సమస్యలతో సహవాసం చేయాల్సిన దుస్థితి తాండూరు మండలంలో నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తగిన దృష్టి సారించి కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలో ఆయాచోట్ల పరిస్థితి: తాండూరు మండలంలో 33 పంచాయతీల్లో 46 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 23,125 కుటుంబాలు ఉండగా 60 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఏటా కుటుంబాలు విస్తరించడంతో కొత్తగా ఆవాసాలు ఏర్పడడంతో కుటుంబాల సంఖ్య వందల సంఖ్యలో పెరుగుతోంది. ఐదు సంవత్సరాల్లో దాదాపు 5వేల కొత్త కుటుంబాలు ఏర్పడ్డాయి. ఆయా వీధుల్లో మౌలిక సదుపాయాలు లేవు. రహదారులు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో వరద వెళ్ల పరిస్థితి లేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. మండల వ్యాప్తంగా సగానికి పైగా గ్రామాల్లో ఇదే పరిస్థితి. అధికారులు, నాయకులు కాలనీలపై దృష్టిసారించి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌టీఆర్ కాలనీలో ఇళ్ల మధ్య మురుగు..

● కరణ్‌కోటలో సీసీఐ టౌన్‌షిప్ ఎదురుగా కొత్త కాలనీ ఏర్పడింది. సీసీ రహదారులు నిర్మించక స్థానికులు సొంతంగా నాపరాయి వ్యర్థాలతో రోడ్డు నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. జిన్‌గుర్తి కొత్తకాలనీలో మురుగు కాల్వలు లేక మురుగునీరు వీధుల్లో పారుతోంది. గౌతాపూర్‌లో ఎల్లమ్మ కాలనీ, శ్రీనివాస కాలనీల్లో ఇదే అవస్థలు. అల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల పక్కన వెలిసిన కాలనీలో అంతర్గత రహదారులు, కాల్వలు లేవు. వర్షాకాలంలో మురుగునీరు ఇళ్లలోకి చేరి అవస్థలు పడుతున్నామని గత నెలలో స్థానికులు ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు.

● అంతారం సమీపంలో ఎన్‌టీఆర్ కాలనీని నాలుగేళ్ల క్రితం మున్సిపాలిటీలో చేర్చారు. 480 నివాసాలు ఉండగా వెయ్యికి పైగా నివాసముంటున్నారు. వీధుల్లో సీసీ దారులు, మురుగు కాల్వలు నిర్మించలేదు. పట్టణానికి సమీపంలోనే ఉన్నా మారుమూల గ్రామాన్ని తలపించేలా పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మిట్ట బాస్పల్లిలో ప్రధాన రహదారిని ఆనుకొని కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. ఇటీవల కొన్నిచోట్ల సీసీ రహదారులు నిర్మించగా మరికొన్ని నిర్మించాల్సి ఉంది.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం:

గ్రామ పంచాయతీ ఖాతాలకు నిధులు విడుదల కావాల్సి ఉంది. మంజూరు కాగానే వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం. కొత్త కాలనీల్లో తాగునీరు, సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఆనంద్‌రావు, ఎంపీవో, తాండూరు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ? కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పక్కన ఇంకా విద్యుత్తు స్తంభాలు తొలగించలేదు.
–రాములు, కుల్కచర్ల.

✔ త్వరలోనే విద్యుత్తు స్తంభాలను పక్కకు జరిపిస్తాం.
– అరవింద్‌రెడ్డి, గుత్తేదారు

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? భవానీనగర్ కాలనీలో మురుగు సమస్యలున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. **– నవీన్, తాండూరు.**

✔ వీధుల్లో కాల్వలు పూర్తి స్థాయిలో శుభ్రం చేయటానికి చర్యలు తీసుకుంటాం. **–విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.**

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? అంతారం నుంచి మండలకేంద్రానికి వెళ్లే దారిలో వాగువద్ద పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. **– భీంషప్ప, అంతారం.**

✔ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. **– రవికిరణ్, పీఆర్ ఏఈ దౌల్తాబాద్**

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? కుల్కచర్ల మండలం పీరంపల్లిలో విద్యుత్తు నియంత్రికలు ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేయాలి. **– జంగయ్య, స్థానికుడు**

✔ ఇళ్ల మధ్య నియంత్రికల సమస్య మా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరలో ఇబ్బందులు తీరేలా చూస్తాం. **– సాయికిరణ్, ఏఈ, విద్యుత్తు శాఖ**

తాండూరు టౌన్, దోమ, న్యూస్‌టుడే: ? తాండూరు పురపాలిక పరిధి సాయిపూర్ ప్రాంతం వీధుల్లో వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **– ప్రవీణ్, తాండూరు**

✔ వీధి దీపాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుని ఇబ్బందులు తీరుస్తాం. **– విక్రమ సింహారెడ్డి, పురపాలిక సంఘం కమిషనరు**

? దోమ మండలం పాలేపల్లి ప్రాథమిక పాఠశాల పాత భవనం శిథిలమైంది. మరమ్మతులు చేయించాలి. **– బసప్ప, స్థానికుడు**

✔ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైతే పరిష్కారానికి కృషి చేస్తాం. **– వెంకట్, ఇన్‌ఛార్జి ఎంఈవో**

న్యూస్‌టుడే, మర్పల్లి: ? మండల కేంద్రం మర్పల్లిలో అంతర్గత మురుగు కాల్వలు సక్రమంగా లేక మురుగు రోడ్లపై పారుతుంది. కాల్వలు నిర్మించాలి. **– రమేష్, కల్హోడ**

✔ మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది. **– రాజమల్లయ్య, ఎంపీడీవో, మర్పల్లి**

సకాలంలో రుణాలు చెల్లిస్తే మేలు

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

కొడంగల్, న్యూస్‌టుడే: రైతులకు కొత్తగా రుణాలు ఇచ్చే అంశంపై ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంఘం చైర్మన్ కటుకం శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు రకాల అంశాలను తీర్మానించారు. పీఏసీఎస్ కార్యాలయం ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో వాటర్ ప్లాంటు ఏర్పాటు, అసైన్డ్ భూములకు రుణాలు అందించడం వంటి పలు అంశాలను ఎమ్‌డీసీసీబీ అధ్యక్షుడు, సీఈవోలకు విజ్ఞప్తి చేసే అంశంపై తీర్మానించారు. సంఘం ఆధ్వర్యంలో అందించిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలపై చర్చించారు.

వడ్డీ భారం తగ్గుతుంది..

ధారూర్, న్యూస్‌టుడే: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంఘంలో తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డి భారం తగ్గుతుందన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు రాజునాయక్, సీఈవో నర్సిములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే ప్రజా సంక్షేమం

రాంపూర్‌లో సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న భాజపా పరిగి అసెంబ్లీ ఇన్‌ఛార్జి మారుతీ కిరణ్

కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో మరింత ప్రగతి సాధించి భాజపా తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని పార్టీ పరిగి అసెంబ్లీ ఇన్‌ఛార్జి మారుతీ కిరణ్ అన్నారు .ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని రాంపూర్, పుట్టపహాడ్‌లో భాజపా సభ్యత్వాలను చేయించారు. మండల పార్టీ అధ్యక్షులు సురేష్, జిల్లా పార్టీ నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలకు మంచి స్పందన వస్తోందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకు ప్రయోజనాన్ని కల్పిస్తున్నాయన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతూ కేంద్రం అమలు చేస్తున్న అన్ని పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరాన్ని ఆయన గురించి తెలిపారు.

మోదీతోనే దేశాభివృద్ధి

పూడూరు,: దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం పూడూరులో పార్టీ నాయకులతో కలిసి ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. పల్లెలో భాజపాను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. శ్రీనివాస్, రాజు ఉన్నారు.

మట్టి కోసుకుపోయి..ప్రమాదకరంగా మారి

కుల్కచర్ల మండల పరిధి బొంరెడ్డిపల్లి దారిలో కల్వర్టు వద్ద ఇటీవల వర్షాలకు రోడ్డు కోసుకుపోయి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులకు దగ్గరకు వచ్చేంత వరకు కోసుకుపోయిన రహదారి కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు కుల్కచర్ల ప్రధాన చౌరస్తా, పాంబండ నుంచి కుల్కచర్ల వైపు వచ్చే రహదారుల పక్కన కూడ వర్షాలకు రోడ్డుకు ఆనుకొని ఉన్న మట్టి కోసుకుపోయింది. ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వాహనాలు ప్రమాదానికి గురికావాల్సిందే. కుల్కచర్ల, దోమ మండలాల్లో పలు చోట్ల రహదారుల మధ్య కల్వర్టులు శిథిలమైపోయాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య వేధిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. గొడుగొని పల్లి వద్ద కల్వర్టు ఎత్తు, దాదాపూర్, రంతగర్, బండవెల్కిచర్ల మార్గాల్లో శిథిలమైన పాత కల్వర్టుల స్థానాల్లో కొత్తవి నిర్మించాలి. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కుల్కచర్ల

మృతదేహం విషయమై జిల్లా ఆస్పత్రిలో వాగ్వాదం

తాండూరు టౌన్: మృత దేహం విషయమై తాండూరు జిల్లా ఆస్పత్రిలో ఓ వైద్యుడు, సంబంధిత కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం..పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన ఓ మహిళ ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. శవ పరీక్షల కోసం కుటుంబ సభ్యులు మృత దేహాన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా సెలవు కావడంతో శవాగారంలో భద్రపరిచారు. ఈ విషయమై మృతురాలి కుటుంబ సభ్యులు, విధులోనున్న వైద్యుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొంత సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విషయం పోలీసులకు తెలియడంతో వారు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతురాలి వర్గానికి చెందిన ఓ న్యాయవాది అక్కడికి వెళ్లి మరోసారి వైద్యుడితో మాట్లాడటంతో మళ్లీ వాగ్వాదం జరిగింది. తనపై వైద్యుడు దురుసుగా ప్రవర్తించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది తెలిపారు.

విద్యార్థులకు క్విజ్

కొడంగల్, న్యూస్‌టుడే: పట్టణంలోని మక్కా మసీదులో ఆదివారం ఉదయం విద్యార్థులకు నాతే షరీఫ్ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మాజీ ఉప సర్పంచి గౌసన్, అబ్దుల్ రషీద్, కరీం తదితరులున్నారు.

నాటక సమాజ జిల్లా కార్యవర్గ ఎన్నికలు

నూతన కార్యవర్గం సభ్యులు

పరిగి, న్యూస్‌టుడే: తెలంగాణ నాటక సమాజ సమాఖ్య జిల్లా స్థాయి కార్యవర్గ ఎన్నికలు ఆదివారం పట్టణంలో జరిగాయి. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణగౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎం.అంజిలయ్యగౌడ్, అధ్యక్షుడిగా బి.నాగేశ్వర్, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేష్, పి.జగదీశ్వర్, లాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జగన్, సహాయ కార్యదర్శులుగా జి.నారాయణ, డి.శ్రీశైలం, ఆర్.నర్సిములు, ప్రచార కార్యదర్శిగా పి.నర్సిములు, కోశాధికారిగా ఎన్.సత్యనారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నర్సిములు, శ్రీనివాస్‌యాదవ్, జి.మల్లయ్య, బి.రాములు, శివకుమార్, శ్రీశైలం, హరినాథ్, మాణయ్యగౌడ్, బసప్ప, నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వెంకటయ్య సేవలు మరువలేనివి

వికారాబాద్, న్యూస్‌టుడే: వికారాబాద్ విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో వెంకటయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మారుమూల గ్రామం లింగాయపల్లి నుంచి న్యాయవాద వృత్తి చేపట్టి పేదలకు బాసటగా నిలిచి విశేష సేవలందించారన్నారు. సీనియర్ న్యాయకులు లంక సుదర్శన్‌రెడ్డి, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

దోమ, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని సర్పంచుల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. ఆదివారం దోమలో ఆయన మాట్లాడుతూ..హైకోర్టు ఆదేశాలు పాటించి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి: సీపీఎం

పరిగి, న్యూస్‌టుడే: చెరువు శిఖం భూములను కబ్జా చేసిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య కోరారు. ఆదివారం పార్టీ సభ్యులతో కలిసి పలుచోట్ల పరిశీలించారు. రూప్‌ఖాన్‌పేట శివారు పోసాని చెరువు, పట్టణంలో ఉన్న కొత్తచెరువు శిఖం భూముల్లో అక్రమంగా షాట్లు చేసి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీనివాస కాలనీలో అక్రమ నిర్మాణాలు వెలిశాయన్నారు. ప్రభుత్వం కబ్జా చెర నుంచి విడిపించాలన్నారు పార్టీ నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, లాలయ్య, శేఖర్ తదితరులున్నారు.

3వ ఆలయ సంఘం ప్రమాణ స్వీకారం

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు మండలం కొత్తాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ సంఘం నూతన అధ్యక్షుడు పట్లోళ్ల నవీన్‌రెడ్డితో పాటు కార్యవర్గ బృందం చేత అక్టోబరు 3న ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శేఖర్‌గౌడ్ తెలిపారు.

వాలీబాల్‌లో పోటీల్లో బాలికల విజయం

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో పూడూరు ఉన్నత పాఠశాల బాలికలు సత్తా చాటారు. అండర్-14 బాలికల విభాగంలో వాలీబాల్ పోటీల్లో వివిధ జట్లు తలపడగా ఆదివారం జరిగిన ఫైనల్‌లో పూడూరు బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని పీడీ శివయ్య తెలిపారు. ఒకరోజు ముందే ఇదే పాఠశాల బాలికలు అండర్-17 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రెండు జట్లు విజయం సాధించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

అలుగులకు మరమ్మతులు చేపట్టక అవస్థలు

నీరు అందక 192 ఎకరాల అయకట్టు బీడు

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: చెరువులు నిండి పారితే ఆయకట్టు కింద ఉన్న చివరి పంట పొలాలకు నీరు అందేలా గతంలో కత్వలు నిర్మించారు. ఈ కత్వలు చెరువు ప్రధాన కాల్వ నుంచి నీరు చేరి నిల్వ ఉండేలా నిర్మించారు. కాల క్రమేణ సమయానికి వర్షాలు లేక చెరువులు నిండక పోవడంతో కత్వలు నిరుపయోగంగా మారాయి. దీంతో కొందరు ఆ ప్రాంతంలో నిల్వ ఉన్న ఇసుకతో పాటు వాటి నిర్మాణాలకు ఉపయోగించిన రాళ్లను సైతం ఎత్తుకెళ్లారు. దీంతో వర్షాకాలంలో కత్వల్లో చేరిన నీరు వృథాగా పారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం దౌల్తాబాద్ పెద్దచెరువు కింద గచ్చుకత్వ, తాళ్లమామిడి కత్వలు నిర్మించారు. వీటి కింద సుమారు 220 ఎకరాల ఆయకట్టు సాగు అయ్యేది. ప్రస్తుతం కత్వలకు లీకేజీలు, అక్కడక్కడ ధ్వసం చేయడంతో నీరు నిల్వడం లేదు. అధికారులు స్పందించి కత్వలకు మరమ్మతులు చేయించేలా తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

దౌల్తాబాద్ కత్వ లీకేజీతో వృథాగా పారుతున్న నీరు

● వర్షాలు కురుస్తున్నా బాధలు తీరలే: నాలుగు సంవత్సరాలుగా వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నా నీటిని వినియోగించుకోలేక పోతున్నామని రైతన్నలు వాపోతున్నారు. దౌల్తాబాద్ రైతులతో పాటు నందారం, యాంకి గ్రామాల రైతన్నలకు కత్వల ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చెరువుల కింద ఉన్న నేలల్లో వర్షాకాలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉండడంతో కేవలం వరి తప్పా ఏ పంటలు సాగు కావడం లేదన్నారు. కత్వలకు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉంటే యాసంగి పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. చెరువు నీరు వదిలినా చివరి ఆయకట్టుకు నీరు చేరక పొలాలు బీడులు మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కత్వలకు మరమ్మతులు చేపడితే సుమారు 150మంది రైతులకు ప్రయోజనం ఉంటుంది.

ఇదే విషయమై ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్ దగ్గర ప్రస్తావించగా మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపట్టి బాగు చేయిస్తామని తెలిపారు.

పాలాలు బీళ్లు:

కత్వ కింద రెండెకరాల భూమి ఉంది. వర్షాధారంగా పత్తి సాగు చేపట్టాం. వర్షాలకు పొలం అంతా ఊట పట్టడంతో పత్తిచేను కుళ్లిపోయి పెట్టుబడి రాని దుస్థితి. గతంలో కత్వ రెండు పంటలు వరి సాగు చేసేవాళ్లం. కత్వకు లీకేజీ, ధ్వంసం కావడంతో నీరంతా వృథాగా పోతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. **చంద్రప్ప, రైతు, దౌల్తాబాద్**

జీవన శైలిని మార్చుకోవాలి: చినజీయర్ స్వామి

శంషాబాద్, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు ఆహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పరిధి శ్రీరామ నగరంలోని జీవా ప్రాంగణంలో కార్డియాలజిస్టు డా. మల్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి, మేధినిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. వైద్యుల అవసరం లేకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. దేవుడి ప్రసాదాన్ని కూడా కలుషితం చేయడం బాధాకరమన్నారు. అహోబిల జీయర్ స్వామి, అజయ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక తెలిపిన వివరాల మేరకు... కర్మాన్‌ఘట్‌కు చెందిన మధుసుదన్ (57) హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రత్యక్షసాక్షులను విచారించగా డీసీఎం ఢీ కొట్టినట్లు చెప్పారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అధ్వాన దారులతో ఇబ్బందులు

నందారం రోడ్డు దుస్థితి

బిచ్చాల మార్గం ఇలా..

న్యూస్‌టుడే, కొడంగల్, దౌల్తాబాద్

గ్రామాలకు వెళ్లే దారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రం నుంచి దౌల్తాబాద్‌కు వెళ్లేదారిలో నందారం వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. భారీ గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు బీటీ రోడ్డు పనులు ప్రారంభించే వరకైనా గుంతల్లో మొరం పోయించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దౌల్తాబాద్ మండలంలో పలు గ్రామాలకు వెళ్లే తారురోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం దౌల్తాబాద్ నుంచి గుమ్మల, బిచ్చాల్, తిమ్మాయిపల్లి, బాలంపేట నుంచి అంతారం, సుల్తాన్‌పూర్ గ్రామాల మీదుగా దేవర్‌పస్లావాద్ వరకు, దౌల్తాబాద్ విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెద్దచెరువు కట్ట మీదుగా రావల్‌పల్ల